క్లుప్తంగా

ఎంపీడీఓల బాధ్యతల స్వీకరణ



పెనుగంచిప్రోలు: స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఎంపీడీఓగా జి.శ్రీను శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకు ఇక్కడ ఎంపీడీఓగా పనిచేసిన ఎం.శ్రీసాయి హర్ష అల్లూరి సీతారామరాజు జిల్లా ముంచింగు మండలానికి బదిలీ కాగా, ఏలూరు జిల్లా, పోలవరం మండలం నుంచి శ్రీను ఇక్కడకు బదిలీపై వచ్చారు. బాధ్యతలు స్వీకరించిన ఆమెను కార్యాలయ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు కలుసుకుని అభినందించారు.

జగ్గయ్యపేట ఎంపీడీఓగా నితిన్..



చిల్లకల్లు(జగ్గయ్యపేట): జగ్గయ్యపేట ఎంపీడీఓ నితిన్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఈసందర్భంగా ఎంపీడీఓ నితిన్ మాట్లాడుతూ మండలాభివృద్ధికి కృషిచేస్తానన్నారు. పంచాయతీ కార్యదర్శులు ఎప్పటికప్పుడు సచివాలయ సిబ్బంది విధులను పర్యవేక్షించడంతో పాటు డ్రైయిన్‌లలో పూడిక తీతలు తీయించాలన్నారు. విధి నిర్వహణలో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

వరదలకు దెబ్బతిన్న మద్దులమ్మ ఆలయ రోడ్డు



గొట్టుముక్కల (కంచికచర్ల): ఇటీవల కురిసిన భారీ వర్షాలు, సంభవించిన వరదలకు కంచికచర్ల మండలం గొట్టుముక్కల సమీపంలో అడవిలో కొలువై ఉన్న మద్దులమ్మ తల్లి దేవాలయానికి వెళ్లే రోడ్డు దెబ్బతింది. దీంతో ఆలయం వద్దకు వెళ్లి మొక్కులు తీర్చుకునేందుకు భక్తులు వెళ్లలేని పరిస్థితి నెలకొంది. ఈ మార్గంలోని ఏనుగువాగు ఉధృతంగా ప్రవహించడంతో కొన్నిచోట్ల రోడ్డు పూర్తిగా కొట్టుకుపోయింది. అడవిలో కొండపై వెలిసిన మద్దులమ్మ ఆలయం వద్దకు వెళ్లేందుకు ఎమ్మెల్సీ డాక్టర్ అరుణకుమార్, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు సొంత నిధులతో అడవిలో సుమారు 600 మీటర్ల సిమెంట్ రోడ్డు వేయించారు. ఈ వర్షాలకు సిమెంటురోడ్డు దిగువన ఉన్న మట్టి రోడ్డు అరకిలోమీటరు మేర దెబ్బతింది. వర్షాలకు రాళ్లు కిందపడి రోడ్డును మూసివేశాయి. దీంతో భక్తులు రాకపోకలు సాగించలేని పరిస్థితి. ఇకనైనా ప్రభుత్వం స్పందించి గొట్టుముక్కల నుంచి ఆలయానికి వెళ్లేందుకు బీటీ లేదా సిమెంటురోడ్డు నిర్మాణం చేపట్టాలని భక్తులు కోరుతున్నారు.

145 మందికి వైద్య పరీక్షలు



శివాపురం(పెనుగంచిప్రోలు): మండలంలోని అనిగండ్లపాడు ప్రభుత్వ ఆయుర్వేద ఆసుపత్రి ఆధ్వర్యంలో శివాపురంలో శుక్రవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. వైద్యాధికారి వై.రత్న ప్రియదర్శిని ఆధ్వర్యంలో మొత్తం 145 మందికి వివిధ వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతిఒక్కరు వ్యక్తిగత పరిశుభ్రతతోపాటు పరిసరాల పరిశుభ్రత పాటించాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ తేళ్ల లక్ష్మణరావు, నాయకులు లగడపాటి మోహనరావు, నరసింహారావు, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

కోడిపందేల శిబిరంపై పోలీసుల దాడి

జగ్గయ్యపేట: కోడి పందాల శిబిరంపై చిల్లకల్లు పోలీసులు గురువారం రాత్రి దాడిచేసి 20మందిని అదుపులోకి తీసుకున్నారు. వివరాల్లోకి వెళితే మండలంలోని బూదవాడ గ్రామంలోని ఆంధ్ర, తెలంగాణ సరిహద్దు ప్రాంతంలో కోడిపందాలు నిర్వహిస్తున్నట్లు సమాచారం అందడంతో ఎస్‌ఐ తోట సూర్య శ్రీనివాస్ సిబ్బందితో వెళ్లి దాడిచేశారు. కోడిపందేలు వేస్తున్న 20 మందిని అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ.70 వేల నగదు. ఆరు బైకులు, 10కోళ్లను స్వాధీనం చేసుకున్నారు. ఈమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

10న మండల పరిషత్ సమావేశం

చందర్లపాడు(నందిగామ టౌన్): చందర్లపాడు మండల పరిషత్ సర్వసభ్య సాధారణ సమావేశాన్ని ఈ నెల 10న నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ జ్యోతి శుక్రవారం తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ గుడేటి నాగమల్లేశ్వరి అధ్యక్షతన నిర్వహించే ఈ సమావేశానికి ప్రజాప్రతినిధులంతా హాజరుకావాలని కోరారు. అన్ని శాఖల మండలస్థాయి అధికారులు వారిశాఖలకు సంబంధించి పూర్తి సమాచారంతో హాజరుకావాలని ఎంపీడీఓ సూచించారు.

ఉచిత ఇసుక హామీ అమలు కోరుతూ ధర్నా

నందిగామటౌన్: ఇసుకను ఉచితంగా అందిస్తామన్న టీడీపీ కూటమి నేతలు వారి హామీని నిలబెట్టుకుని భవన నిర్మాణ కార్మికులను ఆదుకోవాలని సీపీఎం పార్టీ మండల కార్యదర్శి కటారపు గోపాల్ డిమాండ్ చేశారు. సీపీఎం పార్టీ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఉచిత ఇసుక హామీని అమలుచేయాలని డిమాండ్ చేస్తూ ఆపార్టీ నాయకులు నందిగామ పట్టణంలోని గాంధీసెంటరులో శుక్రవారం ధర్నా చేశారు. ఈసందర్భంగా గోపాల్ మాట్లాడుతూ ఇసుక కొరత, అధిక ధరల కారణంగా నిర్మాణ రంగం కుదేలైందన్నారు. ఇసుక అధిక ధరల కారణంగా ప్రజలు, కొరత కారణంగా భవన నిర్మాణ పనులు నిలిచి కార్మికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. జిల్లాలో సుమారు 1.50లక్షల మంది భవన నిర్మాణరంగంపై ఆధారపడి జీవనం సాగిస్తుండగా, ఇసుక కొరతతో వీరికి పనుల్లేక జీవనోపాధి దెబ్బతింటోదన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయలేక కూటమి నేతలు ప్రజల మధ్య మత విద్వేషాలను రెచ్చగొడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇసుక విషయంలో ప్రతిపక్షంలో ఉండగా ఆందోళన చేసిన సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్, మంత్రి లోకేష్ ఇప్పుడు కనీసం నోరు మెదపకపోవడం శోచనీయమని మండిపడ్డారు. ముఖ్యంగా ప్రభుత్వం ప్రకటించిన ఇసుక విధానం పూర్తిగా లోపభూయిష్టంగా ఉందని ధ్వజమెత్తారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు ఇసుకను ఉచితంగా అందించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు సయ్యద్‌ఖాశీం, గోపీ నాయక్, వెంకటేశ్వరరావు, లాజర్, పుల్లయ్య, దానయ్య, సురేష్, శ్రీను, భవన నిర్మాణ కార్మికులు తదితరులు పాల్గొన్నారు.



నందిగామ పట్టణం గాంధీసెంటరులో ధర్నా చేస్తున్న సీపీఎం నాయకులు, భవన నిర్మాణ కార్మికులు



జుజ్జూరులో ధర్నా చేస్తున్న సీపీఎం నాయకులు

ఉచిత ఇసుక విషయంలో ప్రభుత్వం విఫలం...

జుజ్జూరు(వీరులపాడు): ఉచిత ఇసుక హామీని అమలు చేయడంలో టీడీపీ కూటమి ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు కోట కళ్యాణ్ అన్నారు. సీపీఎం పార్టీ పిలుపు మేరకు ఉచిత ఇసుకను అందించాలని కోరుతూ మండలంలోని జుజ్జూరు తహసీల్దార్ కార్యాలయం వద్ద ఆపార్టీ నాయకులు శుక్రవారం ధర్నా చేశారు. ఈ సందర్భంగా కోట కళ్యాణ్ మాట్లాడుతూ అధికారంలోకి రాగానే ఉచిత ఇసుకను అందిస్తామన్న చంద్రబాబు కూటమి, ప్రభుత్వం కొలువుదీరి నెలలు గడుస్తున్నా ఆహామీని మాత్రం నెరవేర్చడం లేదన్నారు. ట్రాక్టర్ ఇసుకను రూ.రెండు వేల నుంచి మూడు వేల వరకు ధర చెల్లించి కొనుగోలు చేసుకోవాల్సిన దుస్థితి నెలకొందని మండిపడ్డారు. దీంతో భవన నిర్మాణదారులు, కూలీలు ఇబ్బందులుపడుతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ఇసుకను ఉచితంగా అందించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి చాట్ల రవి, మండల కమిటీ సభ్యులు మంగళపూడి సుందర్‌రావు, ఏలియా, రామారావు, పలువురు నాయకులు పాల్గొన్నారు.

ఉచితంగా ఇసుకను అందించాలని డిమాండ్..

జగ్గయ్యపేట అర్బన్: ఉచిత ఇసుక హామీని రాష్ట్ర ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని సీపీఎం మండల నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు సీపీఎం జగ్గయ్యపేట మండల కమిటీ ఆధ్వర్యంలో స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద శుక్రవారం ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఆ పార్టీ నాయకులు ఎస్.రామనాధం మాట్లాడుతూ ఉచిత ఇసుక హామీని అమలుచేయడంలో కూటమి ప్రభుత్వం విఫలమైందన్నారు. ఇసుక కొరత కారణంగా భవన నిర్మాణ రంగంలో 36 రకాల వృత్తులవారి జీవనోపాధి దెబ్బతిందన్నారు. జిల్లాల్లోని అన్ని ఇసుక క్వారీలను తెరిచి ప్రజలకు ఉచితంగా ఇసుకను సరఫరా చేయాలని టీడీపీ కూటమి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ధర్నాలో సీపీఎం నాయకులు కోటా కృష్ణ, రావెళ్ల శేషు, షేక్ గౌస్‌మియా, కె.వెంకటేశ్వరరావు, కార్మికులు కటకం చిన కాశయ్య, కిరణ్, గోపి, పూర్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

అధికారులు అందుబాటులో ఉండాలి

ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్



చిల్లకల్లు(జగ్గయ్యపేట): గ్రామాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి అన్ని శాఖల అధికారులు కృషి చేయాలని ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్(తాతయ్య) ఆదేశించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం మండల స్థాయిలో ప్రజాదర్బార్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయా సమస్యల పరిష్కారం కోరుతూ మండలంలోని ఆయా గ్రామాలకు చెందిన 114మంది ప్రజలు ఎమ్మెల్యేకు వినతిపత్రాలు అందజేశారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అన్నిశాఖల అధికారులు గ్రామాల్లో అందుబాటులో ఉండాలన్నారు. మండల స్థాయి అధికారులు, గ్రామస్థాయి అధికారులతో సమన్వయం చేసుకుని ప్రజల సమస్యలను పరిష్కరించాలని సూచించారు. కొందరు అధికారులు తమ దృష్టికి వచ్చిన సమస్యలను పట్టించుకోవడం లేదని ఫిర్యాదులు వస్తున్నాయన్నారు. అటువంటి వారు తమ పనితీరు మార్చుకోవాలని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ నితిన్, తహసీల్దార్ నాగరాజు, ఎంఈవో చిట్టిబాబు, సర్పంచ్‌లు పేరయ్య, శ్రీనివాసరావు, నాయకులు కట్టా నరసింహారావు, రాజ్యలక్ష్మి, విశ్వనాథం డేవిడ్, ఏసుబాబు, అన్ని శాఖల అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

బాలాత్రిపుర సుందరీదేవి నమోస్తుతే

కంచికచర్ల: దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలను కంచికచర్ల మండలంలో వైభవంగా నిర్వహిస్తున్నారు. కంచికచర్ల వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో అమ్మవారు బాలాత్రిపుర సుందరీదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. స్థానిక పశువుల ఆసుపత్రి రోడ్డు, ఫైర్‌స్టేషన్ రోడ్డులో ఏర్పాటు చేసిన పందిళ్లలోని అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించారు. మహాలక్ష్మి అమ్మవారి ఆలయంలో గజలక్ష్మీదేవిగా అలంకారం చేశారు. మండలంలోని గండేపల్లి, పరిటాల, మోగులూరు, చెవిటికల్లు, గనిఆత్కూరు, గొట్టుముక్కల, పేరకలపాడు, మున్నలూరు, కునికెనపాడు, వేములపల్లి, ఎస్ అమరవరం గ్రామాల్లో భక్తులు దుర్గాదేవి అమ్మవారికి అభిషేకాలు, అష్టోత్తర పూజలు, కుంకుమార్చనలతో ప్రత్యేక పూజలు చేశారు.

నందిగామ మండలంలో...

నందిగామ టౌన్: నందిగామ మండలంలో దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. మండలంలోని అంబారుపేటలో వేంచేసియున్న సత్యమ్మ అమ్మవారు శుక్రవారం బాలాత్రిపుర సుందరీదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ ఈవో హరిగోపీనాథ్ పర్యవేక్షణలో అమ్మవారికి విశేష పూజలు, చండీ సహిత రుద్ర హోమం నిర్వహించారు. పల్లగిరి గట్టుపై ఉన్న త్రిశక్తిపీఠంలో వేంచేసియున్న కనకమహాలక్ష్మి, కనకదుర్గ, జ్ఞాన సరస్వతీ అమ్మవార్లను ఆలయ అర్చకులు గాయత్రీమాతగా అలంకరించి పూజలు చేశారు. గోళ్లమూడి శంభులింగేశ్వర స్వామి, కూడలి సంగమేశ్వరస్వామి ఆలయాల్లో పార్వతీ మాతకు ప్రత్యేక అర్చనలు, కుంకుమ పూజలు చేశారు. నందిగామలోని రామలింగేశ్వరస్వామి వారి ఆలయంలో శుకశ్యామలాంబ అమ్మవారు బాలాత్రిపుర సుందరీ దేవి, వాసవీ కన్యకా పరమేశ్వరీ అమ్మవారు, మరిడీ మహాలక్ష్మీ అమ్మవారు గాయత్రిదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు.



వీరులపాడు మండలం అల్లూరులో మహాలక్ష్మీ అమ్మవారికి పూజలు చేస్తున్న భక్తులు



అంబారుపేటలో బాలాత్రిపుర సుందరీదేవి అలంకారంలో సత్యమ్మ అమ్మవారు



తోటచర్లలో పూజలందుకుంటున్న అమ్మవారు



నందిగామలో మరిడీ మహాలక్ష్మి అమ్మవారు

పెనుగంచిప్రోలు మండలంలో...

పెనుగంచిప్రోలు: నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా రెండోరోజు శుక్రవారం అమ్మవారికి భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. పెనుగంచిప్రోలు శ్రీతిరుపతమ్మ అమ్మవారి ఆలయంలో ఉత్సవాల్లో భాగంగా కుంకుమ పూజ నిర్వహించారు. పూజల్లో పలువురు దంపతులు, అధికారులు పాల్గొన్నారు. తూర్పుబజారులో శ్రీదుర్గ మల్లేశ్వరి ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన నవరాత్రుల పందిరిలో అమ్మవారు శ్రీగాయత్రి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. శ్రీస్వయంభు శంభులింగేశ్వరస్వామి ఆలయంలో ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు.

వీరులపాడు మండలంలో..

వీరులపాడు: మండలంలోని అల్లూరులో వేంచేసియున్న సీతారామచంద్ర సహిత మహాలక్ష్మి ఆలయంలో కొలువై ఉన్న అమ్మవారిని అర్చకులు శుక్రవారం గాయత్రిదేవిగా అలంకరించి విశేష పూజలు చేశారు. ఆలయ ధర్మకర్తలు అల్లూరు భాస్కరరావు, అంజనీదేవి దంపతులు ప్రత్యేక పూజలు చేశారు. వెల్లంకిలో ఏర్పాటు చేసిన అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు నిర్వహించారు.

జగ్గయ్యపేట మండలంలో..

జగ్గయ్యపేట: శరన్నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా అమ్మవారు శుక్రవారం గాయత్రీదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. మండలంలోని ముక్త్యాల భవానీ ముక్తేశ్వరస్వామి.ఆలయంలోని భవానీ అమ్మవారు, తిరుమలగిరిలోని శివాలయంలో దుర్గాదేవిని అర్చకులు గాయత్రిదేవిగా అలంకరించారు. గౌరవరంలో రామాలయం వద్ద ఏర్పాటు చేసిన అమ్మవారి విగ్రహం వద్ద ఉత్సవాలు అంగరంగ వైభవంగా సాగుతున్నాయి. మహిళలు సామూహిక కుంకుమ పూజలు చేశారు.

జగ్గయ్యపేట పట్టణంలో..

జగ్గయ్యపేట అర్బన్: దేవి శరన్నవరాత్రి ఉత్సవాలలో భాగంగా శుక్రవారం పట్టణంలోని పలు అమ్మవారి ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. నకాశిబజారులోని శ్రీకనకదుర్గ అమ్మవారి ఆలయంలో శ్రీగాయత్రీదేవి అలంకరణలో అమ్మవారు దర్శనమిచ్చారు. అద్దాలబజారు శ్రీమహాలక్ష్మి అమ్మవారి వెండి దేవాలయంలో శ్రీగాయత్రీదేవి అలంకరణలో ఉన్న అమ్మవారికి అభిషేకాలు, గోపూజ, కుంకుమ పూజ చేశారు. శ్రీదుర్గామల్లేశ్వరస్వామి ఆలయంలో అమ్మవారు శ్రీ బాలాత్రిపురసుందరీదేవిగా, చెరువుబజారులోని శ్రీరేణుకాపరమేశ్వరి అమ్మవారి ఆలయంలో గాయత్రీదేవిగా, అద్దాలబజారు శ్రీకన్యకాపరమేశ్వరి ఆలయంలో శ్రీలలితాత్రిపుర సుందరీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. మార్కండేయబజారులో యూత్‌వారు ఏర్పాటు చేసిన కనకదుర్గమ్మ మండపంలో అమ్మవారు గాయత్రీదేవి అలంకరణలో దర్శనమిచ్చారు.

వత్సవాయి మండలంలో..

వత్సవాయి: దసరా శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం అమ్మవారు గాయత్రీదేవిగా దర్శనమిచ్చారు. వత్సవాయి, దబ్బాకుపల్లి, కంభంపాడు, భీమవరం, మక్కపేట, మంగొల్లు, చిట్టేల గ్రామాలలో ఏర్పాటు చేసిన అమ్మవారి విగ్రహాల వద్ద భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. శరన్నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని మహిళలు రంగురంగు పూలతో అందంగా తయారుచేసిన బతుకమ్మలను ఒకచోట చేర్చి ఆడిపాడుతున్నారు. బతుకమ్మలను స్థానికంగా కాలువలు, మునేరు, చెరువులలో నిమజ్జనం చేస్తున్నారు.



జగ్గయ్యపేట మండలం గౌరవరంలో గాయత్రీదేవి అలంకారంలో దుర్గాదేవి



కంచికచర్ల పశువుల ఆసుపత్రి రోడ్డు దుర్గాదేవికి పూజలు చేస్తున్న భక్తులు



పేటలోని శ్రీకన్యకాపరమేశ్వరి ఆలయంలో ప్రత్యేకాలంకరణలో అమ్మవారు



పెనుగంచిప్రోలులో శ్రీగాయత్రి అలంకరణలో అమ్మవారు



వత్సవాయిలో కన్యకాపరమేశ్వరి ఆలయంలో గాయత్రిదేవిగా అమ్మవారు

గ్రామాల అభివృద్ధికి చర్యలు: ఎమ్మెల్యే

నందిగామ టౌన్: గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటుందని ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య తెలిపారు. మండలంలోని మునగచర్ల గ్రామంలో ఎన్ఆర్‌జీఎస్ పథకం నిధులు రూ.20లక్షలతో చేపడుతున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులకు శుక్రవారం ఆమె శంకుస్థాపన చేశారు.ఈసందర్భంగా ఎమ్మెల్యే సౌమ్య మాట్లాడుతూ రాష్ట్రాభివృద్ధే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పాలన సాగిస్తోందన్నారు. ముఖ్యంగా సార్వత్రిక ఎన్నికల సమయంలో ఇచ్చిన ప్రతి ఒక్క హామీని నిలబెట్టుకునేలా ప్రభుత్వం ప్రణాళికలను రూపొందిస్తోందని వివరించారు. కార్యక్రమంలో నాయకులు పంగులూరి వెంకటనరసయ్య, వీరంకి వీరాస్వామి, వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. అదే విధంగా మండలంలోని ఐతవరంలో ఎన్ఆర్జీఎస్ నిధులు రూ. 20 లక్షలతో చేపడుతున్న అభివృద్ధి పనులకు మాజీమంత్రి వసంత నాగేశ్వరరావు శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ నాయుడు ఉదయలక్ష్మి, పలువురు టీడీపీ నాయకులు పాల్గొన్నారు.



మునగచర్లలో సీసీరోడ్ల నిర్మాణ పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే సౌమ్య

ఉత్సాహంగా బతుకమ్మ ఉత్సవాలు



జగ్గయ్యపేట అర్బన్: శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా స్థానిక బతుకమ్మ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న బతుకమ్మ వేడుకలు మూడోరోజు శుక్రవారం రాత్రి స్థానిక శ్రీముత్యాలమ్మ ఆలయంలో అత్యంత వైభవంగా సాగాయి. ఈ సందర్భంగా రంగురంగుల వివిధరకాల పూలతో తయారుచేసిన బతుకమ్మలతో మహిళలు పెద్ద సంఖ్యలో తరలి వచ్చి పూజలు చేశారు. మహిళలు బతుకమ్మ ఆడిపాడారు. బతుకమ్మ అభివృద్ధి కమిటీ ప్రతినిధులు అనంతరాజా, తులసి సుబ్బారావు, యర్రా శ్రీనివాసరావు, నోముల శివకుమార్, చెక్కా సుధాకర్, కేతవరపు వెంకట్ పాల్గొన్నారు. స్థానిక బ్రాహ్మణ బజారులోని కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయం వద్ద మహిళలు బతుకమ్మ వేడుకలు నిర్వహించారు.

గోతులమయమైన గండేపల్లి-కీసర రోడ్డు

కంచికచర్ల: మండలంలోని గండేపల్లి నుంచి కీసర వెళ్లే ఆర్ అండ్‌బీ రోడ్డుపై పెద్దపెద్ద గోతులు ఏర్పడ్డాయి. ఈ రోడ్డుపై వెళ్లాలంటే వాహనదారులు, ప్రయాణికులు, ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. రోడ్డుపై ఏర్పడ్డ గోతుల్లో ఎక్కడ పడిపోతామోనని ప్రాణాలను అరచేతిలోపెట్టుకుని ప్రయాణిస్తున్నారు. నిత్యం ఈ రోడ్డుపై వాహనాలు, పాఠశాలలకు వెళ్లే బస్సులు, ఆటోలతోపాటు గండేపల్లిలోని సెంటినీ కర్మాగారానికి నిత్యం పదుల సంఖ్యలో భారీ వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. ఇదే రోడ్డుపై వీరులపాడు మండలంలోని పలు గ్రామాల ప్రజలు నియోజకవర్గ కేంద్రమైన నందిగామ వివిధ పనుల కోసం వెళ్తుంటారు. గండేపల్లి ప్రజలు మండల కేంద్రమైన కంచికచర్ల, నందిగామ రాకపోకలు సాగిస్తుంటారు. ఇంతటి ప్రాధాన్యం ఉన్న ఈ రోడ్డుపై పెద్దపెద్ద గోతులు ఏర్పడటంతో ప్రజలు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. వర్షాలకు ఆయా గోతుల్లో వర్షపునీరు నిలిచి వాహనాల రాకపోకలకు తీవ్ర అవరోధం ఏర్పడుతోంది. ఇటీవల గ్రామానికి చెందిన కొంతమంది నాయకులు రోడ్డు సమస్యను సెంటినీ యాజమాన్యం దృష్టికి తీసుకెళ్లగా వారు సొంత నిధులతో రోడ్డును బాగుచేయించారు. అయితే ఇటీవల భారీగా కురిసిన వర్షాలకు రోడ్డుపై రోడ్డుపై గోతులు ఏర్పడి పూర్తిగా దెబ్బతింది. ఆర్‌అండ్‌బీ అధికారులు స్పందించి గండేపల్లి-సర రోడ్డుపై పడిన గోతులను పూడ్చడంతోపాటు రోడ్డుకు మర్మమతులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.





గండేపల్లి-కీసర రోడ్డుపై పడిన గోతులు